

ఇంటర్‌లో 78 శాతం ఉత్తీర్ణత

- ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 63 శాతం ఉత్తీర్ణత
- మే నెలలో సప్లిమెంటరీ
- దరఖాస్తు చేసుకోండి
- ఫీజు చెల్లింపు గడువు ఈనెల 15 నుంచి 24 వరకు




రాయవరం జూనియర్ కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అమలాపురం, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను శనివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన విద్యార్థులు 78 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో ద్వితీయ సంవత్సరంలో 9,477 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 7,431 మంది అంటే 78 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరానికి చెందిన 10,698 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 6,772 మంది 63 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. కోనసీమ జిల్లాలో ప్రథమ సంవత్సరంలో ఉత్తీర్ణత 63శాతం సాధించగా గత ఏడాది ఉత్తీర్ణత కంటే 3 శాతం పెరిగింది. ద్వితీయ సంవత్సరం 78 శాతం ఉత్తీర్ణత సాధించగా గతేడాది కంటే 6 శాతం పెరిగింది. ప్రథమ సంవత్సవరం ఫలితాల్లో కోనసీమ జిల్లా గత ఏడాదిలో 17వ స్థానంలో ఉంటే ఈ ఏడాది 16వ స్థానానికి చేరుకుంది. ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణతలో గత ఏడాది 17వ స్థానంలో ఉంటే ఈ ఏడాది 19వ స్థానంలో నిలిచింది. జిల్లావ్యాప్తంగా ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వనుము సోమశేఖరరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు తమ జవాబు పత్రాలను రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఇంటర్మీడియట్ అధికారి వనుము సోమశేఖరరావు ఈ సందర్భంగా తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులై కొన్ని సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు వస్తే బెటర్‌మెంట్ పరీక్షల్లో పరీక్ష ఫీజు చెల్లించడానికి, ఫెయిల్ అయిన విద్యార్థులు తిరిగి పరీక్ష రాసేందుకు ఈ నెల 15 నుంచి 24వ తేదీలోగా ఫీజులు చెల్లించాలని కోరారు. సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు మే 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు అధైర్య పడకుండా మే నెలలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించాలని ఆయన సూచించారు.



బుద్ధ విహార్ వ్యవస్థాపకుడు జగదీశ్వరరావు



వేమగిరి కొండపై నిర్మించిన బుద్ధ విహార్‌లో ఆవిష్కరణకు సిద్ధమైన మహోదయ మైత్రేయ బుద్ధ విగ్రహం

జ్ఞానము.. ఆహ్లాదము!

వేమగిరి కొండపై బౌద్ధ క్షేత్రం

8 నేడు 84 అడుగుల మహోదయ మైత్రేయ బుద్ధ విగ్రహావిష్కరణ

అన్న'వరమే'



- అన్నవరం దేవస్థానంలో సౌకర్యాలకు పెద్దపీట
- ప్రభుత్వం మారడంతో కొండపై భారీగా అభివృద్ధి పనులు
- పూర్తయిన ప్రసాద్‌స్కీం టెండర్లు.. ఏడాదిన్నరలోగా పనుల పూర్తి
- మొత్తం రూ.21 కోట్లతో భక్తులకు వసతి సదుపాయాలు
- ఎకరంన్నర స్థలంలో రూ.10.34 కోట్లతో అన్నప్రసాద భవనం
- ఒకేసారి మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాదం
- రూ.11 కోట్లతో క్యూ కాంప్లెక్స్, మురుగునీటి శుద్ధిప్లాంటు
- రూ.8.32 కోట్లతో కాటేజీ.. రూ.80 లక్షలతో రెండో మెట్ల మార్గం
- అయిదేళ్లలో ఆలయ అభివృద్ధిని గాలికి వదిలేసిన వైసీపీ సర్కారు
- ప్రభుత్వం మారాక భక్తుల నుంచి నిరంతర ఐవీఆర్‌ఎస్ సర్వే
- సదుపాయాలపై ర్యాంకులతో అధికారులకు ముచ్చెమటలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రసిద్ధి చెందిన అన్నవరం సత్యదేవుడి ఆలయానికి భారీగా దశ తిరగబోతోంది. మునుపెన్నడూ లేనివిధంగా ఒకేసారి రూ.21 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులు పట్టాలెక్కబోతున్నాయి. గత వైసీపీ పాలనలో ఆలయ నిధులను అభివృద్ధి ముసుగులో వృథా చేసి, తలాకొంత మెక్కేయగా, ఇప్పుడు ప్రభుత్వం మారాక భక్తులకు సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఏళ్ల తరబడి పాతుకుపోయిన సమస్యలకు పరి ష్కారం లభించబోతోంది. ఏటా లక్షల్లో తరలివచ్చే భక్తులకు ఇకపై ఏ లోటు లేకుండా మౌలిక సదుపాయాలను భారీగా కల్పించడానికి రంగం సిద్ధమవుతోంది. ఎప్పుడో ప్రసాద్ స్కీం కింద ఆలయానికి నిధులు విడుదలైనా గత ప్రభుత్వం పట్టించుకోక వాటికి గ్రహణం పట్టింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఆలయానికి మహర్దశ పట్టబోతోంది. నిలిచిపోయిన నిధులను రప్పించడంతోపాటు పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. దీంతో త్వరలో ఇవి మొదలు కానున్నాయి. దేవస్థానం సైతం రూ.8.32 కోట్ల సొంత నిధులతో కాటేజీ నిర్మించాలని నిర్ణయించింది. ఇదికాక మరో రూ.80 లక్షలతో కొండపైకి రెండో మెట్ల మార్గం కొత్తగా నిర్మించబోతోంది. గత ప్రభుత్వం ఆలయాన్ని గాలికి వదిలేయగా, ఇప్పుడు ప్రభుత్వం మారాక సీఎం చంద్రబాబు ఆదేశాలతో కొండపై నిరంతర పర్యవేక్షణ జరుగుతోంది.

ఎన్ని సదుపాయాలో...

రూ.21 కోట్లతో ఖరారైన టెండర్లకు సంబంధించి ప్రధానంగా కొండపై అత్యవసరమైన అన్నప్రసాదం భవనాల సామర్థ్యాన్ని రూ.10.34 కోట్లతో పెంచబోతున్నారు. ఒకేసారి మూడువేల మంది కూర్చునేలా అన్నప్రసాదం భవనాలు నిర్మించనున్నారు. సత్రం గదులకు సమీపంలో ప్రస్తుత అన్నప్రసాద భవనానికి అతిసమీపంలో ఈ కొత్త భవనాల సముదాయాన్ని ఎకరంన్నర స్థలంలో నిర్మించబోతున్నారు. వచ్చే నెల నుంచి ఈ పనులు మొదలుపెట్టి ఏడాదిన్నరలోగా పూర్తి చేయాలని భావిస్తున్నారు. అలాగే అన్నప్రసాద భవనాలను ఆనుకుని క్యూ కాంప్లెక్స్, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.9.91 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే భక్తులు ఎంతమంది వచ్చినా సజావుగా అన్నప్రసాద వితరణ జరగనుంది. అలాగే కొండపైకి వచ్చే వేలాది భక్తులకు తాగునీటి వసతి, టాయిలెట్ బ్లాకులను రూ.61.78 లక్షలతో నిర్మించబోతున్నారు. మొబైల్ టాయిలెట్లను కూడా తీసుకువచ్చి కొండపై మరింత స్వచ్ఛ వాతావరణాన్ని పెంపొందించాలని భావిస్తున్నారు. కొండపైన భక్తులకు అందుబాటులోకి రూ.97.98 లక్షలతో రెండు ఎలక్ట్రికల్ బస్సులు రాబోతున్నాయి. ఇదికాక రూ.1.08 కోట్లతో కొండపై మురుగునీటిశుద్ధి నిర్వహణ చేపట్టనున్నారు. ప్రసాద్ స్కీం పనులతో సంబంధం లేకుండా ఆలయ నిధులతో పలు పనులు ప్రారంభించబోతున్నారు. అందులో రూ.8.32 కోట్లతో 125 గదులు నిర్మించేందుకు టెండర్లు పిలవగా దేవదాయ కమిషనర్ ఆమోదం తెలిపారు. రూ.80లక్షలతో కొండదిగువ నుంచి కొండపైకి రెండో కొత్త మెట్ల మార్గం పనులు ప్రారంభించారు. అలాగే రూ.2 కోట్లతో పశ్చిమరాజగోపురం వద్ద ఓ ఫార్మా సంస్థ షెడ్ల నిర్మాణానికి ముందుకొచ్చింది.



అప్పుడంతా గాలికి.. ఇప్పుడు ఐవీఆర్‌ఎస్..

గత వైసీపీ సర్కారు అన్నవరం దేవస్థానాన్ని గాలికి వదిలేసింది. ఏ చిన్న అభివృద్ధి పని చేయకుండా అయిదేళ్ల ఆలయాన్ని పట్టించుకోవడం మానేసింది. ఆలయ ఖజానాపై కన్నేసి కొండకింద అక్కర్లేని నమూనా ఆలయం పేరుతో కోట్లకు కోట్లు వృథా చేసేసింది. పనుల ముసుగులో కొందరు నేతలు భారీగా కాసులు నొక్కేశారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత ప్రభుత్వం అన్నవరం దేవస్థానంపై ప్రత్యేక దృష్టిసారించింది. భక్తులకు ఏ చిన్న ఇబ్బంది లేకుండా వసతులపై నిరంతరం పర్యవేక్షణ జరుపుతోంది. భక్తులకు ఫోన్లు చేసి ఐవీఆర్‌ఎస్ విధానంలో అభిప్రాయ సేకరణ జరుపుతోంది. భక్తులు తమ ఫోన్ నుంచి క్యూఆర్‌కోడ్ స్కాన్ చేస్తే ఆ నంబరుకు ఐవీఆర్‌ఎస్ కాల్స్ వెళ్తాయి. అప్పుడు వారు తమ అభిప్రాయాలను తెలిపిన దాన్ని బట్టి ఆలయానికి ప్రభుత్వం ర్యాంకింగ్ ప్రకటిస్తుంది. కొన్ని నెలల కిందట తొలి విడతలో ప్రకటించిన ర్యాంకులో దేవస్థానానికి చివరి ర్యాంక్ వచ్చింది. దీంతో సీఎంవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. దీంతో కలెక్టర్ నెలకొకసారి పర్యటించి పరిస్థితులు మెరుగుపరచడంతో ఆ తర్వాత సర్వేలో ఆలయానికి రెండో ర్యాంకు లభించింది. దీంతో ఆలయ అధికారులు నిత్యం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నారు. సత్రం గదుల పరిశుభ్రత నిర్వహణ బాధ్యతలకు సంబంధించి ఒక్కో కాటేజీ ఒక్కో ఏఈవోకు అప్పగించారు. వీరు ప్రతిరోజు సత్రంగదులు తనిఖీచేసి రిపోర్టును అందజేస్తున్నారు. సీఆర్వో విభాగంలో పూర్తి ప్రక్షాళన చేపట్టారు. త్వరగా దర్శనానికి క్యూలైన్ వ్యవస్థలోనూ మార్పులు చేపట్టారు.

ఎక్కడికక్కడ లోపాలు సరిదిద్దుతూ..

అన్నవరం సత్యదేవుడి దర్శనానికి ఏటా తెలుగురాష్ట్రాలతోపాటు ఒడిషా, పశ్చిమబెంగాల్ నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఏడాదికి ఇక్కడకు వచ్చే భక్తులు కోటి మందిపైనే ఉంటారు. తీరా భక్తుల రద్దీకి తగ్గట్టుగా కొండపై పెద్దగా సదుపాయాలు లేవు. దీంతో భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా అన్నప్రసాదానికి తాకిడి అధికంగా ఉంటోంది. ప్రస్తుతమున్న అన్న ప్రసాద భవనాలు ఒకేసారి 400 మంది మాత్రమే సరిపోతున్నాయి. దీంతో చాలా నిరీక్షణ ఉంటోంది. రద్దీ సమయాల్లో అయితే గంటల తరబడి వేచి ఉండలేక కొందరు కొండ కిందకు వెళ్లిపోతుంటే, కొందరు ధరాభారమైనా హోటళ్లలో తింటున్నారు. మరోవైపు ఇటీవల ఆలయంలో భక్తులకు అందుతున్న సదుపాయాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఈ లోపాలు అధికంగా వ్యక్తమయ్యాయి. ఫలితంగా ఆలయ పనితీరుకు సంబంధించి ర్యాంకు అట్టడుగుకుపోయింది. దీంతో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కలెక్టర్ ఆకస్మికంగా కొండపై పర్యటించి అన్న ప్రసాద కేంద్రంలో భక్తులకు బఫే విధానం అమలుచేయించారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండపై కొందరికే అన్నప్రసాదం అందేది. రద్దీ సమయంలో రోజుకు 2,500 మందికి కూడా భోజనం వడ్డించలేదు. కానీ ప్రభుత్వం మారడంతో అందరికీ అన్నప్రసాదం ఇవ్వాలని కంకణం కట్టుకుంది. ఈ మేరకు ప్రసాద్ స్కీం కింద నిధులతో ఈ సదుపాయాలను భారీగా కల్పించాలని నిర్ణయించింది. వాస్తవానికి అన్నవరం దేవస్థానం కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిట్యుయల్ అగు మెంటేషన్ డ్రైవ్) స్కీం కింద 2021లో ఎంపికైంది. దీంతో వచ్చే నిధులతో కొండపై మౌలిక సదు పాయాల కల్పన చేపడుతున్నట్టు అప్పట్లో వైసీపీ సర్కారు ఊదరగొట్టింది. స్కీం కింద ఆలయానికి రూ.48 కోట్లు వస్తాయని ప్రకటించింది. కానీ చిల్లిగవ్వ రాలేదు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత కేంద్రంతో సంప్రదింపులు చేయడంతో రూ.21 కోట్లు విడుదలకాగా, ఇటీవల టెండర్లు పూర్తవగా, పనులు ప్రా రంభం కానున్నాయి. త్వరలో రెండో విడత కింద మరో రూ.20 కోట్లు రానున్నాయి.



15 నిమిషాల్లో గమ్యం..

మీడియాతో మాట్లాడుతున్న ఐజీ, ఎస్పీ తదితరులు

అంతలోనే మృత్యువు!

- పాస్టర్ ప్రవీణ్ మృతికి కారణం రోడ్డు ప్రమాదమే
- పోలీసుల దర్యాప్తులో వెల్లడి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

చుర్రున ఎండ.. సుమారు 500 కిలోమీటర్ల ప్రయాణం.. మద్యం.. అజాగ్రత్త.. వేగం వెరసి పాస్టర్ ప్రవీణ్ ప్రాణాలను తీశాయని పోలీసుల దర్యాప్తులో తేలింది. గత నెల 24న హైదరాబాద్‌లోని ఫస్ట్ రేట్ ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ, క్రైస్తవ బోధకుడు, మోటివేషనల్ స్పీకర్ పాస్టర్ పగడాల ప్రవీణ్ హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం బయలుదేరి 12 గంటలు ప్రయాణించి ఇంకో 15 నిమిషాల్లో గమ్యం చేరుతారనగా మృత్యువాత పడ్డారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆధారాలను విశ్లేషణ చేసి రోడ్డు ప్రమాదమని తేల్చారు. దానికి మద్యం, వేగం, అజాగ్రత్త కారణమని చెప్పారు. ప్రవీణ్ ప్రయాణంలో మూడు సార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రవీణ్ మార్గ మధ్యలో నాలుగుసార్లు ఆగి మొత్తం రూ.2,842 విలువ చేసే మద్యం (బడ్వయిజర్ మాగ్నం బీర్లు, రాయల్ చాలెంజ్ విస్కీ, బకార్డి జిన్) కొనుగోలు చేశారు.

● దర్యాప్తు సాగిందిలా..

కేసు తీవ్రత దృష్ట్యా డీఎస్పీ జి.దేవకుమార్ ఇంచార్జిగా, డీఎస్పీ వై.శ్రీకాంత్ పరిశోధనాధికారిగా ఐదు దర్యాప్తు బృందాలను ఏర్పాటుచేశారు. విజయవాడ నుంచి ప్రమాదం జరిగిన ప్రదేశం వరకూ ఒక బృందం, విజయవాడ నుంచి హైదరాబాద్ వరకూ ఒకటి, హైదరాబాద్ నగరంలో నివాస స్థలం వరకూ మరొకటి, విజయవాడ నగరంలో సీసీ కెమెరాలు పరిశీలన ఒక బృందం, సాంకేతిక విశ్లేషణకు.. ఇలా ఐదు బృందాలకు పని అప్పగించారు. జిల్లా ఫింగర్ ప్రింట్స్ యూనిట్, జిల్లా రవాణా అధికారి, ఇద్దరు ఎంవీఐ, ఇద్దరు ఏఎంవీఐ బృందం, మంగళగిరి నుంచి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్‌తో కూడిన బృందం ఘటనా స్థలాన్ని, బైక్‌ని క్షుణ్ణంగా పరిశీలించింది. హెల్మెట్, కళ్లజోడు, ఎన్ 95 మాస్కు, రక్తపు మరకలు ఉన్న వస్తువుల నమూనాలను ఆర్ఎఫ్ఎస్ఎల్‌కి పంపించారు.

● ప్రమాదం జరిగింది ఇలా..

ఐజీ అశోక్ కుమార్.. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌తో కలిసి ఈ కేసు దర్యాప్తు వివరాలను శనివారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం చేరుకునే క్రమంలో మద్యం మత్తు ప్రభావం ఆయనపై ఉండడంతో సుమారు గంటకు 70 కిలోమీటర్ల స్పీడుతో కేవలం సిగ్నల్ లైటు వెలుతురులో డ్రైవ్ చేస్తూ కొంతమూరు నయారా పెట్రోల్ బంకు సమీపంలో అదుపుతప్పి రోడ్డు దిగారు. రోడ్డు బెర్మ్‌పై కంకర పరిచి ఉంది. దానిపై జారి 7 అడుగుల లోతులో ఉన్న ఒక రెయిన్ వాటర్ డ్రెయిన్‌లోని గోతిలో పడిపోయారు. ఆయనపై బుల్లెట్ పడింది. ఆయన శరీరంలోని కాలేయం, కిడ్నీ తదితర భాగాల్లో ఇథైల్ ఆల్కహాల్(మద్యం) గుర్తించామని ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులో ఉంది. ఆయన ప్రమాదం జరిగిన చోటే ప్రాణాలు విడిచారని పోస్టుమార్టం చేసిన వైద్యుల బృందం రిపోర్టు చెబుతోంది.



వైద్యుల బృందం శవ పరీక్ష చేసింది. కొవ్వూరు టోల్‌గేట్ దాటిన తర్వాత అంటే ప్రమాదం జరగడానికి కొద్దినిమిషాల ముందు.. ప్రవీణ్ వాహనంతోపాటు ప్రయాణించిన వాహనాలను పరిశీలించారు. రాపిడి మరకలు ఏమీ లేవని నిర్ధారించుకున్నారు. మార్గమధ్యలో ఆయన 6 చోట్ల యూపీఐ పేమెంట్లు చేశారు. అవి ఆయన ఎకౌంటుతో సరిపోయాయి. గతనెల మార్చి 12, 13 తేదీల్లో రాజమండ్రిలో సుధా వైన్స్‌లో ప్రవీణ్ మద్యం కొనుగోలు చేసిన వుటేజీలనూ సేకరించారు. మొత్తం 14 రోజుల దర్యాప్తులో 100 మందిని విచారించారు. మార్గమధ్యలో ఆరుగురితో ఫోనులో మాట్లాడారు. అవి మామూలు మాటలే. ఒకసారి భార్యతో మాట్లాడారు. విజయవాడ దాటుతున్నానని ముక్తసరిగా చెప్పి ఫోన్ పెట్టేశారు.



వైభవంగా స్వామివారి చక్రస్నానం

- పాల్గొన్న ఆర్డీవో శ్రీకర్, డీసీ చక్రధరరావు
- గోదావరి తీరం భక్తజన సంద్రం

8



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు

మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కరుణాకరరెడ్డి కుట్ర

అముడా చైర్మన్ స్వామినాయుడు ఆరోపణ

అమలాపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు పేర్కొన్నారు. శనివారం అమలాపురంలోని తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోట్ల మంది హిందువుల ఆరాధ్య దైవంగా భావించే వేంకటేశ్వర స్వామిపై విమర్శలు చేస్తున్న ఆయన టీటీడీ చైర్మన్‌గా ఎందుకు పదవి నిర్వహించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. టీటీడీపై అసత్య ప్రచారం చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న కరుణాకరరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోశాలలో వంద ఆవులు చనిపోయాయంటూ అసత్య ఆరోపణలు చేస్తున్నారు.. ఇప్పటివరకు వృద్ధాప్య, వ్యాధులు వంటి కారణాలతో 40 ఆవులు మృత్యువాత పడ్డాయన్న విషయాన్ని గ్రహించాలన్నారు. కరుణాకరరెడ్డి ప్రెస్‌మీట్‌లో ఆవులు చనిపోయినట్టు చూపించినవి ఇక్కడివి కాదని, ఎక్కడివోనన్నారు. ఆ ఫొటోలను అడ్డం పెట్టుకుని టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గోవుల సంరక్షణకు 260 మంది ఉద్యోగులు పనిచేస్తుంటే టీటీడీ పట్టించుకోవడం లేదని ఆరోపించడం తగదన్నారు. కరుణాకరరెడ్డి ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించి అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు కోనసీమలో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు పర్యటన

- రాణేలంకలో కోడికత్తి శ్రీను ఇంటికి వెళ్లనున్న ఏబీ
- అమలాపురంలో మీడియా సమావేశం ఏర్పాటు

అమలాపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటిలిజెన్స్ మాజీ డీజీపీ, సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. తొలిసారిగా ఆయన ప్రజా క్షేత్రంలోకి అడుగుపెట్టనుండడంతో అటు రాజకీయ, ఇటు అధికార ప్రముఖుల్లో ఏబీ పర్యటనపై సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆదివారం ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి కోనసీమ జిల్లా పరిధిలోని ముమ్మిడివరం మండలం రాణేలంక శివారు పెదపాలెంలోని జనిపల్లె శ్రీనివాసరావు అలియాస్ కోడికత్తి శ్రీను ఇంటికి చేరుకోనున్నారన్న సమాచారం చర్చకు దారితీసింది. గత కొన్ని సంవత్సరాల కిందట విశాఖ ఎయిర్‌పోర్టులో అప్పటి వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిపై జనిపల్లి శ్రీనివాసరావు అలియాస్ కోడికత్తి శ్రీను హత్యాయత్నానికి పాల్పడ్డారన్న ఆరోపణలై ఎన్‌ఐఏ ఐదేళ్లపాటు బెయిల్ రాకుండా ఆంక్షలు విధించింది. ఆ కేసు అప్పుడు, ఇప్పుడు ప్రజల్లో, రాజకీయ పార్టీల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలోనే ఇంటిలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావుపై ప్రభుత్వం వేటు వేసింది. జగన్ ఐదేళ్ల పాలనలో ఏబీ వెంకటేశ్వరరావుకు పోస్టింగ్ ఇవ్వకుండా సస్పెన్షన్‌లోనే కొనసాగించారు. అయితే రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటిలిజెన్స్ చీఫ్‌గా పనిచేసి జగన్ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురైన ఆయనకు పోలీసు కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించినప్పటికీ ఆయన ఇంకా బాధ్యతలు స్వీకరించలేదని సమాచారం. ఈ తరుణంలో రాణేలంకలోని కోడికత్తి శ్రీను ఇంటికి వచ్చి శ్రీను కుటుంబ సభ్యులతోనే, వివిధ సంఘాల నాయకులతో సమావేశమై న్యాయపరమైన సలహాతోపాటు ఇతర అంశాలు అక్కడ చర్చలు జరపనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలో ఏబీ వెంకటేశ్వరరావు పర్యటన కోనసీమలో ఉత్కంఠకు కారణమైంది. ముమ్మిడివరం పర్యటన ముగించుకున్న అనంతరం అమలాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో పాల్గొనున్నారు. కోడికత్తి శ్రీను ఐదేళ్లు జైలులో ఉన్న సమయంలో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా ఉన్న వెంకటేశ్వరరావు ఇప్పుడు ఆ కేసు వ్యవహారంలో ప్రజాక్షేత్రంలోకి అడుగు పెట్టి గత ప్రభుత్వ వైఫల్యంపై ఏమి నిర్ణయం తీసుకుంటారనే అంశం కోనసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది.



అగ్గి రేగితే... బుగ్గే

- మండుతున్న ఎండలు
- అగ్ని ప్రమాదాలు జరిగేందుకు అవకాశం
- ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరి

వేసవి వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. అగ్ని ప్రమాదాలకు ఇదే అదను. మానవ తప్పిదం వల్లో లేక ప్రకృతి వైపరీత్యం వల్లో ఈ సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే సర్వం క్షణాల్లో బుగ్గిపాలవుతుంది. ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం సంభవించేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

(కాకినాడ క్రైం-ఆంధ్రజ్యోతి)

వేసవిలో ఎక్కడో ఒకచోట అగ్ని ప్రమాదాలు సంభవిస్తూనే ఉంటాయి. కొంతమంది ఆకతాయిలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చుట్ట, సిగరెట్లను ఆర్పకుండా ఎండు గడ్డిపైన వేయడమో లేక చెత్తకుప్పలపైన వేయడమో చేస్తుండడంతో భారీ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇవే కాకుండా షార్ట్ సర్క్యూట్ సంభవించి కూడా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.



గ్రామాల్లో రైతులు భద్రపర్చుకునే ధాన్యం రాశులు, గడ్డివాములు వేసవి కాలంలో తరుచూ అగ్ని ప్రమాదాలకు గురవుతాయి. ఈ గడ్డివాములను దూరం ఎక్కువ పెడితే ఎక్కువ ఆస్తి నష్టం సంభవించకుండా ఉంటుంది. రైతులు ఎక్కడైనా వ్యర్థాలను తగులపెట్టేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవడం శ్రేయస్కరం. ముఖ్యంగా పెట్రోల్ బంకుల వద్ద సెల్‌ఫోన్ మాట్లాడడం చాలా ప్రమాదకరం. పెట్రోల్ బంకుల యాజమాన్యం ఒకవేళ ప్రమాదం జరిగితే మంటలను అదుపు చేసేందుకు డీసీపీ వంటి సిలెండర్లను అందుబాటులో ఉంచుకోవాలి.

ఎండా కాలంలో ఎక్కువ కరెంట్ వాడడం వల్ల షార్ట్ సర్క్యూట్ సంభవించే అవకాశాలున్నాయి. ముఖ్యంగా పాత విద్యుత్ వైర్లు,



కాలం చెల్లిన స్విచ్‌లు, స్విచ్ బోర్డులను మార్చి కొత్త వాటిని వినియోగంలోకి తీసుకొస్తే షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉండదు.

ఇళ్లల్లో రాత్రివేళ వంట పూర్తయిన తర్వాత గ్యాస్ స్టౌ రెగ్యులేటర్‌ను కట్టడం తప్పనిసరి. సిలిండర్‌కు ఐఎస్ఐ ముద్ర కలిగిన ట్యూబ్ మాత్రమే వాడాలి. సిలిండర్ నుంచి గ్యాస్ లీకయితే దళసరి దుప్పటి లేదా గోనెసంచి సహాయంతో రెగ్యులేటర్ వద్ద చుట్టి అగ్నిని నివారించవచ్చు.

ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా అగ్ని ప్రమాద నివారణ పరికరాలను అమర్చాలి.

భారీ, చిన్నతరహా పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి.

ముఖ్యంగా అపార్ట్‌మెంట్ల చుట్టూ అగ్నిమాపక శకటం తిరిగే విధంగా ఖాళీ వదలాలి.

పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన విషయాలపై ఎప్పటికప్పుడు ప్రయోగాత్మకంగా


పాఠశాలలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు విద్యార్థులను రక్షిస్తూ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

అవగాహన కల్పించాలి.

ముఖ్యంగా బాణసంచా తయారీ కేంద్రాల్లో అగ్నిమాపక శాఖాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి లైసెన్స్, తయారీ విధానం సక్రమంగా ఉన్నాయో లేవో పరిశీలిస్తూ ఉండాలి.

ఎటువంటి విపత్తులను ఎదుర్కొనేందుకైనా సంసిద్ధంగా ఉన్నాం


పోలుమహంతి వెంకటసాయి రాజేష్
కాకినాడ జిల్లా అగ్నిమాపక శాఖాధికారి

వేసవి కాలం మొదలైంది కాబట్టి ప్రకృతి వైపరీత్యాలతోపాటు మానవ తప్పిదాలతో కూడిన ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలున్నాయి. కాకినాడ తీర ప్రాంతం కాబట్టి తుపాను తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో కలిసి పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్ల వద్ద మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్నాం. ఒకవేళ పెద్ద వైపరీత్యం సంభవిస్తే ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో కలిసి ఎదుర్కోవడానికి సన్నద్ధంగా ఉన్నాం. జిల్లావ్యాప్తంగా ఏడు అగ్నిమాపక కేంద్రాలు వుండగా 101 మంది సిబ్బంది ఉన్నారు. ఎనిమిది అగ్నిమాపక శకటాలున్నాయి. ప్రతి అగ్నిమాపక కేంద్రంలోనూ అత్యాధునిక అగ్ని ప్రమాద నివారణ పరికరాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అగ్నిమాపక శాఖకు మరిన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చనుంది. పెద్ద అగ్ని ప్రమాదాలు సంభవిస్తే భారీ పరిశ్రమలకు సంబంధించిన అగ్నిమాపక శకటాలు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా వున్నాయి.



వేమగిరి కొండపై బౌద్ధ క్షేత్రం.. ధ్యాన ముద్రలో తథాగతుని విగ్రహం

వేమగిరి కొండపై బౌద్ధ క్షేత్రం

నేడు 84 అడుగుల మహోదయ మైత్రేయ బుద్ధ విగ్రహావిష్కరణ

కడియం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పచ్చని పసిడి వర్ణాల ప్రాంతం కడియంలో రాజమహేంద్రవరానికి కూతవేటు దూరంలో వేమగిరి కొండపై పోలీసు విశ్రాంత ఉద్యోగి యార్లగడ్డ జగదీశ్వరరావు బౌద్ధ క్షేత్రాన్ని నిర్మించారు, ఇందులో బుద్ధుని 84 అడుగుల విగ్రహావిష్కరణ ఆదివారం జరగనుంది. ఉండ్రాజవరం బౌద్ధ కేంద్రం బౌద్ధ భిక్షువు అనలియో, కర్నాటక బైలుకుప్పం ప్రాంతంలోని బౌద్ధ కేంద్రానికి చెందిన భిక్షువులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారు.

ఉద్యోగం చేసిన కాలం నుంచే..

ఉద్యోగ జీతానికి తోడు మరికొంత రుణం చేసి జగదీశ్వరరావు వేమగిరిలో 1996లో కొంత స్థలాన్ని కొనుగోలు చేశారు. 1998లో మరో 73 సెంట్లు స్థలం కొని ఆనాటి నుంచి బౌద్ధ క్షేత్రానికి ఏర్పాట్లు చేయడం మొదలు పెట్టారు. 2013లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 2013లో బుద్ధుని విగ్రహ రూపకల్పనకు శిల్పులు పనులు ప్రారంభించగా 2019 వరకు సాగాయి. విగ్రహం భూమిలో 33 అడుగులు పునాది ఉంది. ఆపై బుద్ధుని కాళ్ల వరకు 18 అడుగులు, ఆపై 66 అడుగులు... వెరసి 84 అడుగుల విగ్రహం ఏర్పాటు చేశారు. వేమగిరి బుద్ధ విహార్‌లో నేల తాడి, నేల ఉసిరి, గుంట కాడ ఆకు, పొన్నగంటి కూర, సర్పసతి ఆకు, రావి, వేప, సీతాఫలం, లక్ష్మణఫలం, రామతులసి, లక్ష్మణతులసి వంటి అనేక రకాల మొక్కలు పెంచుతున్నారు. మహనీయులు, దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటుచేసి వారి జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు. బుద్ధ విగ్రహం కింద చుట్టూరా ధర్మ హాలు ఏర్పాటు చేశారు. దీంట్లో బౌద్ధం, చరిత్ర, సాహిత్యం వంటి అనేక రచనలకు సంబంధించిన వందలాది పుస్తకాలను భద్రపరిచారు.

1955 అక్టోబరు 10న జన్మించిన జగదీశ్వరరావు పదో తరగతి పూర్తిచేసి 1975లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఉద్యోగం చేస్తూనే ప్రైవేటుగా ఆంధ్రా యూనివర్శిటీ నుంచి ఎంఏ (సోషియాలజీ), ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో లా డిగ్రీ, మేనేజ్‌మెంట్ ఆఫ్ వలంటరీ ఆర్గనైజేషన్‌లో పీజీ డిప్లొమా చదివారు. 1991లో ఎస్ఐ పోటీ పరీక్షకు హాజరై ఉద్యోగం సాధించారు.

మహనీయుల చరిత్రలు చదివి బుద్ధిజం వైపు అడుగులు

మహోదయ యాజరా
బుద్ధవిహార్ వ్యవస్థాపకుడు



బుద్ధిజం గొప్పదని ఆనాడు మహనీయుడు గురజాడ అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రాహుల్ సాంకృత్యాయన్, భారతదేశ చారిత్రక పితామహుడు డీడీ కోశాంబి వంటి మహనీయుల రచనలు చదివి నేను బుద్ధిజం వైపు అడుగులు వేశాను. హేతువాదం, నాస్తికత్వం, సైన్సు, తత్వశాస్త్రాల్లో పలు రచనలు చేశారు. ప్రవక్తలు, తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, సంఘ సంస్కర్తలు, విప్లవకారులు, త్యాగధనుల చరిత్రలు చదివాను.

బౌద్ధ క్షేత్రంలో 'చిత్రాలు'


బుద్ధ విగ్రహం కింది భాగంలో నిర్మించిన ధర్మ హాలు



బౌద్ధ వనంలో బుద్ధ భగవానుని విగ్రహం.. ఆకట్టుకునే తైలవర్ణ చిత్రపటం

ఎందరో మహానుభావులు.. అందరూ ఇక్కడే..



ఇంటర్ ఫలితాల్లో 'తిరుమల' ప్రభంజనం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో తిరుమల అకడమిక్ డైరెక్టర్లు

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరం తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470కు 467 మార్కులు ఐదుగురు విద్యార్థులు యు.విరోనిక, ఎం.హర్షిత, ఎస్.తేజ, జి.రాజనవీస్‌తేజ, ఎ.వీరవెంకట సాయిలిఖి సాధించారని, 466మార్కులు పైన 31మంది, 464 మంది పైన 369 మంది, 460 పైన 1086 మంది, 450 పైన 2,133 మంది సాధించి 99.20 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 440కి 436 మార్కులు 11మంది విద్యార్థులు కె.సుప్రియ, ఎ.రామతేజస్విని, సీహెచ్ నేహాగ్రేస్, జి.మోహనరూప, జె.భవిత, కె.గాయత్రి, జి.సరయు, బి.యశశ్విని, షేక్‌సమీనా, ఆర్.వీరగంగ నాగేంద్ర, పి.ప్రణవసాయిగణేష్ సాధించారని, 435 పైన 32 మంది, 433 పైన 91 మంది, 430పైన 167 మంది, 400పైన 463 మంది మార్కులు సాధించి 99.47 ఉత్తీర్ణత సాధించారన్నారు.

సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను 991 మార్కులు ఏడుగురు విద్యార్థులు ఎం.ప్రియహాసిని, సీహెచ్ హరిసూర్య, బి.పవిత్ర, కె.మానస, ఎస్.లేఖన, ఎస్.సాయిలిఖిత, వి.దాత్రికావ్యశ్రీ సాధించారన్నారు. 23 మంది విద్యార్థులకు 990 మార్కులు, 331 మంది విద్యార్థులకు 985పైన, 791 మంది విద్యార్థులకు 980 పైన, 2,151 మంది విద్యార్థులకు 950మార్కులు పైన సాధించి 99.98 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను షేక్ ఫాతీమున్నీషాబేగం 991మార్కులు, బి.నాగవైష్ణవి, సీహెచ్ వీడీ రేణుక, ఎస్.వైష్ణవి, బిహర్షిత, ఎస్.మణి, జి.రితిక 990 మార్కులు సాధించారన్నారు. 108 మంది విద్యార్థులకు 980 పైన, 204మంది విద్యార్థులకు 970 పైన, 297 మంది విద్యార్థులకు 950 పైన మార్కులు సాధించి ఉత్తీర్ణత నూరు శాతం సాధించారన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను తిరుమల రావు అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'శ్రీప్రకాష్' విద్యార్థుల ప్రభంజనం


ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

తునిరూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ తెలిపారు. తమ కళాశాల నుంచి 15 మంది పైగా విద్యార్థులు 980కంటే ఎక్కువ మార్కులు సాధించారని తెలిపారు. ఎంపీసీలో ఆర్ ఎస్ఎస్ నగేష్(464/470), జి.అనూష (460/470), కె.యామినీ జ్యోతిక(460/470), జి.లాస్యశ్రీ (460/470), బైపీసీలో ఆర్.నాగసూర్య భవ్య(429/440), ద్వితీయ సంవత్స రంలో ఎంపీసీలో ఎ.హర్షిత 988/1000, ఎస్.మేఘన 986/1000, బైపీసీలో ఎం.సత్యఅక్షయ 986/1000, సీహెచ్ పూర్ణశివాని 984/1000 మార్కులు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్ వి.కె నరసింహారావు, ప్రిన్సిపాల్ వీవీఎస్‌బీ.భాను మూర్తి, అకడమిక్ ఇన్‌చార్జి డి.శ్రీలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఇంటర్‌లో 'ఆదిత్య' జయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య కార్యదర్శి ఎస్.కృష్ణ దీపక్‌రెడ్డి

కాకినాడ రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో జూనియర్, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఆదిత్య జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి జయకేతనం ఎగురవేసినట్లు ఆదిత్య కార్యదర్శి ఎస్.కృష్ణ దీపక్‌రెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో వై.ప్రసన్నాంబిక, బి.లక్ష్మీ సంజన, కె.బాల వెంకటేశ్వరరావు టి.మాధవి 470 మార్కులకుగానూ 466, 16మంది విద్యార్థులు 465 మార్కులు పొందారన్నారు. బైపీసీలో టి.సాహితి, బి.అనిత 440 మార్కులకుగానూ 435, ఒకరు434, ఇద్దరు 433, 8మంది 432 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస్.సవిత 1000మార్కులకు గానూ 992, షేక్ అసిన్, కె.యాస్మిన్‌షేక్ 991, నలుగురు 990, 7గురు 989, ముగ్గురు 988 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో టీవై.ప్రియ, సుహృది 1000మార్కులకుగానూ 989, ఒకరు 987, ఇద్దరు 986, ఒకరు 985, ఎంఈసీలో దుర్గా చంద్రిక 980, త్రిపుర నాగ 976, ఒకరు 974మార్కులు పొందినట్లు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విదాసంస్థల చైర్మన్ ఎస్.శేషారెడ్డి, కార్యదర్శి ఎస్.కృష్ణ దీపక్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎస్.సతీష్ రెడ్డి, సమన్వయకర్త లక్ష్మీకుమార్ అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో రామేశ్వరంలో 15 శాతం ఉత్తీర్ణత

- అంతర్వేదిపాలెంలో సున్నా శాతం

అంతర్వేది, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంత్వేదిపాలెం హైస్కూలు ప్లస్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైసీపీ, ఎంపీసీ గ్రూపుల్లో ఆరుగురు విద్యార్థులు పరీక్షలు రాయగా సున్నా శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో డి.కిశోర్‌కుమార్ తెలిపారు. అలాగే రామేశ్వరం హైస్కూలు ప్లస్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 11 మంది పరీక్షలు రాయగా ఒక విద్యార్థి ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీలో ఎనిమిది మంది పరీక్షలు రాయగా ఇద్దరు మాత్రమే ఉత్తీర్ణులై 15 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో కిశోర్‌కుమార్ తెలిపారు.

57 మంది విద్యార్థుల్లో ఒక్కడే పాస్

రౌతులపూడి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌ఫలితాల్లో రౌతులపూడిలోని జడ్పీ హైస్కూల్లో ప్లస్(ఇంటర్) ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీలో 57 మంది హాజరు కాగా ఒక్కడు మాత్రమే ఉత్తీరుడయ్యాడు. కాగా సదరు పాఠశాలలో ఈ ఏడాదే ఇంటర్ తరగతులు ప్రారంభించారు.

16 మందికి ఒక్కరే..

బిక్కవోలు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో బిక్కవోలు జడ్పీ ప్లస్ పాఠశాలలో సీఈసీ గ్రూపు నుంచి ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 16 మంది హాజరు కాగా ఒక్కరే పాసయ్యారని హెచ్ఎం పి.వీరప్రభాకరరావు తెలిపారు. పాఠశాలలో ఈ ఏడాదే ఇంటర్ ప్రారంభించారన్నారు.

వైభవంగా స్వామివారి చక్రస్నానం

- పాల్గొన్న ఆర్డీవో శ్రీకర్, డీసీ చక్రధరరావు
- గోదావరి తీరం భక్తజన సంద్రం



అశేష భక్తజనం నడుమ స్వామివారి గ్రామోత్సవం, చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా ఆరోవ రోజు శనివారం స్వామివారికి మేల్కొలుపు, గోదావరి నదీ జల సంగ్రహణం, నిత్యార్చన, ప్రధాన హోమాలు, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలు వేదపండితులు ఘనంగా నిర్వహించారు. వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. గౌతమి గోదావరి నదీ తీరాన చలువ పందిర్లను ఏర్పాటుచేసి సుదర్శనమూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించారు. గౌతమి నదీతీరాన స్వామివారి చక్రస్నాన మహోత్సవం వేలాది మంది భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో శ్రీకర్ దంపతులు, ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు దంప తులు, కూటమి పార్టీ శ్రేణులు చక్రస్నానం నిర్వహించారు. అనంతరం సా యంత్రం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు కల్యాణోత్సవ పూజలునిర్వహించారు. బలిహరణ, ధ్వజావరోహణం నిర్వహించి కార్యక్రమాలను ముగించారు. ఆదివారం శ్రీపుష్పోత్సవంతో శ్రీవారి కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.

'షిర్డిసాయి' విజయబావుటా

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో షిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అ త్యుత్తమ ఫలితాలతో విజయబావుటా ఎగురవేశారని శ్రీషిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య వెల్లడించారు. ఫస్టియర్ ఫలితాల్లో ఎంపీసీ 470 మార్కులకు 465 జి.మెహర్‌సత్యప్రసాద్, ఎం.అభినవ్‌వివేక్‌లు ప్రథమ స్థానంలో, 464మార్కులతో ఎన్‌వీపీ వర్షిత్, ఎం. తను శ్రావ్యశ్రీ, వై.బ్లెస్సీ ద్వితీయ, 463 మార్కులతో బి.సాయిప్రకాష్, కె.తేజస్విని, ఎస్. నిత్యశ్రీ, పి.భద్రసాహితీ, ఎస్.లలిత, ఆర్.హాజీరా తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బైపీసీలో 440మార్కులకుగాను 428తో ఎస్.తేజశ్రీ ప్రథమ స్థానాన్ని, 416 మార్కులతో డి.దేవిసాయి ద్వితీయ స్థానాన్ని సాధించారు. మొత్తం 16మంది 460పైగా మార్కులు సాధించగా, 63మంది 450పైగా సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో వి.మ ణికంఠ 990 మార్కులతో ప్రథమస్థానాన్ని, ఎం. హాసిని, ఎన్.నందిని, వి.శివకేశవ, జి.సాయిముఖేష్ 987 మార్కులతో ద్వితీయస్థానాన్ని, జి.దివ్య 986మార్కులతో తృతీయస్థానాన్ని కైవసం చేసుకున్నారు.



విద్యార్థులతో చైర్మన్ శ్రీధర్, అధ్యాపకులు

కవల పిల్లల బావిని సందర్శించిన మంత్రి

- బావి అభివృద్ధికి హామీ ఇచ్చిన మంత్రి దుర్గేష్

రంగంపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కవల పిల్లల బావిని మంత్రి దుర్గేష్ సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం పెద్ద దొడ్డిగుంట గ్రామంలో ఉన్న కవల పిల్లల బావి గురించి ఈనెల 6వ తేదీన ఆంధ్రజ్యోతి ఆదివారం పుస్తకంలో 'ఆ పల్లె ఇంట..కవలల పంట' అనే శీర్షికతో కవర్‌స్టోరీ ప్రచురితమైన విషయం తెలుసుకున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్థానిక నాయకులతో కలిసి శనివారం పెద్దదొడ్డిగుంటలో ఉన్న కవల పిల్లల బావిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో ఉన్న కవల పిల్లల బావి నీరు ఇతర రాష్ట్రాలకు, దేశాలకు కూడా సరఫరా అయ్యి మన గ్రామంతో పాటు జిల్లా, రాష్ట్రానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఈ బావి అభివృద్ధికి తమ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ తరుపున కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మంత్రివెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.


కవల పిల్లల బావిని సందర్శిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, తదితరులు

వేగం.. మిగిల్చింది చేదు జ్ఞాపకం!

- డివైడర్‌ను ఢీకొని పంటపొలాల్లోకి పల్టీలు కొట్టిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలు, ఏడుగురికి స్వల్పగాయాలు
- బాధితులంతా చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం బందార్లపల్లికి చెందినవారు
- యర్నగూడెం జాతీయ రహదారిపై ఘటన


గాయపడిన చందన


క్షతగాత్రులను అంబులెన్స్‌లో తీసుకెళ్తున్న స్థానికులు


ధ్వంసమైన కారు

దేవరపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన 10 మందితో ప్రయాణిస్తున్న కారు తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలోని యర్నగూడెం జాతీయ రహదారిపై శనివారం ప్రమాదానికి గురైంది. డివైడర్‌ను ఢీకొనడంతో పంటపొలాల్లోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా రామకుప్పం మండల బందార్లపల్లికి చెందిన ఓ కుటుంబం ఈ నెల 10న దైవదర్శనం కోసం కారులో బయల్దేరి విజయవాడలోని కనకదుర్గమ్మ, భద్రాచలంలోని రాములవారిని దర్శించుకున్నారు. ఈ క్రమంలో 11న తేదీ రాత్రి అన్నవరం చేరుకుని అక్కడే రాత్రి బసచేశారు. అనంతరం శనివారం ఉదయం సత్యనారాయణస్వామి దర్శనం చేసుకుని తిరిగి ప్రయాణిస్తుండగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో యర్నగూడెం జాతీయ రహదారిపై కారు డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఇందులో ప్రయాణిస్తున్న 10 మందిలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, గౌరక్కగారి చిన్నమ్మాయి, షబ్రేష్, పోతుల చందనాకు తీవ్రగాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్పగాయాలైన వారికి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం తీవ్రగాయాలైన ముగ్గురిని రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ గౌరక్కగారి శ్రీకాంత్ కారును వేగంగా నడపటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు గుర్తించారు. ఇందులో గౌరక్క గారి చిన్నమ్మాయి, పోతుల లత, పోతుల సోమశేఖర్, పోతుల యశ్వంత్, పోతుల చందన, భార్గవి, షబ్రేష్, లతిక, శిరీషతోపాటు ముగ్గురు చిన్నారులున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పొట్ట కూటి కోసం వెళ్లి విగతజీవులై...

- విద్యుత్ షాక్‌తో ముగ్గురి మృతి
- మరో ముగ్గురికి గాయాలు
- కాపవరం రైస్ మిల్లు వద్ద ప్రమాదం


మృతిచెందిన శ్రీరామ్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ


ప్రమాదానికి కారణమైన ట్రాలీ


సంఘటనా స్థలంలో బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల, పోలీసు అధికారులు

కోరుకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కాపవరం మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని రైస్ మిల్లు వద్ద శనివారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. కాపవరం గణపతి రైస్‌మిల్లులో శనివారం ఉదయం ధాన్యం లోడు చేసే కన్వర్ట్ బెల్ట్‌ను ట్రాలీపై తీసుకెళ్తుండగా సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు ట్రాలీ చివరి భాగం తగిలి షాక్‌కు గురయ్యారు. ఆకుల శ్రీరామ్(30), జాజుల వెంకటేశ్వరరావు(55), బలసాల అన్నవరం సత్యనారాయణ(45) అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పొట్ట కూటి కోసం వెళ్లిన తమ వారు విగతజీవులుగా మారడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాద విషయం తెలియడంతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి నార్త్ జోన్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5లక్షలు వంతున ప్రభుత్వం నుంచి సహాయం అందించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే మిల్లు యాజమాన్యం ఒక్కో కుటుంబానికి రూ.15లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని పెద్దల సమక్షంలో నిర్ణయించినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాగా కాపవరం విద్యుత్ ప్రమాదంపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యకిషోర్ పేర్కొన్నారు.. మృతదేహాలకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో షాక్‌కు గురై స్వల్పంగా గాయపడిన శ్రీరంగం నాగు, ఆకుల ఏసురాజు, కోరుకొండ రాజులు క్షేమంగానే ఉన్నారు.

రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు..

విద్యుత్ ప్రమాదంలో మరణించిన ఆకుల శ్రీరామ్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ కుటుంబాలు రెక్కాడితే కాని డొక్కాడని వ్యవసాయ రైతు కూలీలు. ప్రతిరోజు రైస్ మిల్లుకు వెళ్లి లారీ లోంచి ధాన్యం బస్తాలు దింపి మిల్లుకు వేయడం, మిల్లులో తయారైన బియ్యం లారీలో లోడ్ చేయడం చేస్తుంటారు. అలా కూలి డబ్బులతోనే వారి జీవనం గడుస్తుంది. శ్రీరామ్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు. పిల్లలు చిన్నవారు కావడం, కుటుంబంలో పెద్ద దిక్కు చనిపోవడంతో దిక్కులేని వారయ్యారు. వెంకటేశ్వరరావుకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు. ముగ్గురికీ వివాహాలయ్యాయి. వెంకటేశ్వరరావు మిల్లులో పనిచేసే డబ్బులతోనే కుటుంబ పోషణ జరిగేది. అన్నవరం సత్యనారాయణకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ముగ్గురు మరణించడంతో నిరుపేద కుటుంబాలు రోడ్డున పడ్డాయి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. సర్పంచ్ జాజుల రాము, ఎంపీటీసీ కాలచర్లనాగు, వైస్ ఎంపీపీ బొరుసు బద్రి మృతుల కుటుంబాలను పరామర్శించారు.

ఆర్థిక ఇబ్బందులతో

అక్క ఇంట్లో చెల్లి దొంగతనం

ముగ్గురిని అరెస్ట్ చేసిన నిడదవోలు పోలీసులు, రూ.12.55 లక్షల సొత్తు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

నిడదవోలు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సొంత అక్క ఇంట్లో చెల్లే దొంగతనానికి పాల్పడగా నిడదవోలు పోలీసులు ఒక్కరోజులోనే పట్టుకున్నారు. నిడదవోలు సీఐ పీవీజీ.తిలక్ తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణం ఎంవీనగర్ సమీపంలో నివాసముంటున్న బలిజ శశి లలితాదేవి ఈనెల 10న ఇంటికి తాళం వేసుకుని తన పనిచేస్తున్న పాఠశాలకు వెళ్లిపోయింది. అదే అదునుగా తీసుకున్న లలితాదేవి సొంత చెల్లెలు తాడేపల్లిగూడెనికి చెందిన పడాల లక్ష్మీ శైలజ ఆర్థిక ఇబ్బందుల కారణంగా అక్క ఇంట్లోనే దొంగతనం చేసేందుకు ప్లాన్ చేసింది. దొంగతనంలో సహకరించేందుకు సమీప బంధువు అయిన ఉండ్రాజవరం గ్రామానికి చెందిన బండి సత్యవేణిని సహాయం కోరింది. దొంగతనంలో కూడా వాటా ఇస్తానని ఒప్పించింది. బీరువాను కట్ చేసేందుకు ఉండ్రాజవరం గ్రామానికి చెందిన కప్పకాయల సురేంద్ర సాయంతో 10వ తేదీ మధ్యాహ్నం ఇంట్లోకి ప్రవేశించి బీరువాను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి లక్ష్మీదేవి హారం, నల్లపూసల గొలుసు, చెవి బుట్టల జత, రెండు గాజులు, చెవి కమ్మల జత, చేప లాకెట్ చైన్, సాధారణ చైన్, గుళ్ళ చైన్, పాపిటబొట్టు ఇలా సుమారు 198 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు వారు దోచుకుపోయారు. ఆ వస్తువుల విలువ రూ.12 లక్షల 55 వేల ఉంటుందని సీఐ తెలిపారు. తెలిసినవారే ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారన్న అనుమానంతో ఆ కోణంలో విచారించారు. శనివారం తణుకువెళ్లి బంగారు నగలు విక్రయించేందుకు కానూరు వద్ద దొంగతనానికి పాల్పడిన ముగ్గురు కలిశారు. దీంతో వారిని అరెస్ట్ చేసి బంగారు అభరణాలు, నగదు స్వాధీనం చేసుకుని కోర్టుకు పంపామని సీఐ తెలిపారు. దొంగతనం జరిగిన ఒక్కరోజు వ్యవధిలోనే కేసును ఛేదించిన సీఐ తిలక్, ఎస్ఐ కె.జగన్మోహనరావు, సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

డీజే విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

బ్లేడ్లతో దాడి

ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు



గాయపడిన యువకులు

రావులపాలెం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో జరిగిన పోలేరమ్మ జాతరలో డీజే పాటల విషయంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణ కారణంగా ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని పొడగట్లపల్లిలో పోలేరమ్మ జాతర సందర్భంగా డీజే సౌండ్స్ ఏర్పాటు చేశారు. డీజే వెంట శనగనపూడి దిలీప్‌కుమార్‌తో పాటు అతడి స్నేహితులు డ్యాన్స్ చేస్తున్నారు. ఆ సమయంలో సరిపెళ్ళ కిరణ్‌బాబు, కొల్లి దిలీప్, పులిదిండి వంశీ, రొక్కాల నాగరాజు, కొల్లి ప్రవీణ్‌తో పాటు మరో యువకుడు మరో పాటను ప్లే చేయ్యమని కోరగా దానికి దిలీప్‌కుమార్, స్నేహితులు నిరాకరించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ ఏర్పడింది. దిలీప్‌కుమార్, స్నేహితులపై ఆరుగురు బ్లేడ్లతో దాడి చేశారు. దీంతో దిలీప్‌కుమార్, కుసంపూడి జ్యోతి శివసాయిప్రకాష్ పృద్వీరాజ్‌కు తీవ్ర గాయాలు కావడంతో కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు.

ముగిసిన నది సినిమా షూటింగ్


సినిమా షూటింగ్‌లో మహర్షి ఉద్యా, నాజర్

మోతుగూడెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో నది చిత్ర బృందం 38రోజుల పాటు చేసిన షూటింగ్ ముగిసింది. ఈ చిత్రంలో హీరోగా మహర్షి ఉద్యా, ముఖ్య పాత్రలో నటుడు నాజర్ నటించారు. కొన్ని సన్నివేశాలు డొంకరాయి డ్యాంపక్కన, కూనవరం, వీఆర్‌పురంలో తీశారు. ఈ సినిమాకు డైరెక్టర్ ఆదిత్య వెంపాటి కాగా నిర్మాతలు బ్రైడన్ బెంట్, కృష్ణ మామిడి.

పోగొట్టుకున్న బ్యాగు అందజేత

తుని రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ప్రయాణికుల బ్యాగును రైల్వే పోలీసులు అందజేశారు. తునికి చెందిన తూనికుంట్ల లలిత, ఫణికుమార్‌లు తమ బ్యాగు తుని రైల్వేస్టేషన్ పరిధిలో పోగొట్టుకుని ఉండడంతో బ్యాగుని రైల్వే పోలీసులు కనుగొని బ్యాగులో గల 36 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు రూ.3లక్షల నగదును పోలీసులు అందజేశారు.


ఉత్సాహంగా...

చేబ్రోలులో రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

సీనియర్స్ విజేత కొవ్వాడ

జూనియర్స్ విజేత వడిశలేరు




పోటీలో పరుగులు తీస్తున్న ఎడ్లు


సీనియర్స్ విజేతకు బహుమతి ప్రదానం


జూనియర్స్ విజేతకు బహుమతి అందజేత

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. సీతారామస్వామి ఆలయ కమిటీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అనకాపల్లి, బాపట్ల, కృష్ణా, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలు, తెలంగాణాలోని హైదరాబాద్ నుంచి ఎడ్ల జతలు తరలివచ్చాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం పక్కనే ఉన్న పుంతరోడ్డులో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్స్ విజేతలకు ఓదూరి నాగేశ్వరరావు, కిషోర్‌లు, చేదులూరి దత్తుడు, గవర్రాజు, సారిపల్లి లోవరాజులు.. జూనియర్స్ విజేతలకు అల్లం దొరబాబు, ఓరుగంటి చిన్ని, సారిపల్లి శ్రీను, కర్రి చిట్టిబాబు నగదు పురస్కారాలు, షీల్డులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా యనమల కృష్ణుడు, సిద్ధా నానాజీ, సామర్లకోట రామకృష్ణ వ్యవహరించారు.

విజేతలు వీరే

సీనియర్స్ విభాగంలో నిర్దేశించిన దూరాన్ని కాకినాడ జిల్లా కొవ్వాడ మట్టా నవనీత్ శ్రీ మణికంఠకు చెందిన ఎడ్ల జత 6 నిమిషాల 56సెకన్ల 78 పాయింట్ల సమయంలో పరుగెత్తి ప్రథమస్థానంలో నిలవగా, కోనసీమ జిల్లా గుమ్మిలేరు కోరా తేజ చౌదరి ఎడ్ల జత 7-01-28 సమయంలో, మండపేట వేగుళ్ల తేజ చౌదరి ఎడ్ల జత 7-08-09సమయంలో పరుగెత్తి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. జూనియర్స్ విభాగంలో తూర్పుగోదావరి జిల్లా వడిశలేరు సిద్ధి వినాయక ధరణి శ్రీనివాస్‌కు చెందిన ఎడ్ల జత 4-42-65 సమయంలో పరుగెత్తి తొలి స్థానం సాధించగా, హైదరాబాద్‌కు చెందిన కె.సతీష్ ఎడ్లజత 4-45-09 సమయంలో, కాకినాడ జిల్లా గొల్లప్రోలు నిమ్మకాయల నూకరాజు ఎడ్ల జత 4-48-40, వన్నెపూడి బవిరిశెట్టి మణికి చెందిన ఎడ్ల జత 4-50-56 సమయంలో పరుగెత్తి వరుసగా 2, 3, 4 స్థానాల్లో నిలిచాయి.

నేడు వెలుగుబందలో...

రాజానగరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబందలో గ్రామదేవత శ్రీసత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 13న కూటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు రౌండ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో తొలిసారిగా రౌండ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ పోటీలను జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ప్రారంభిస్తారన్నారు. వివరాలకు 9000662999లో సంప్రదించాలని కోరారు.

త్రివిధ దళాలు.. అదిరే విన్యాసాలు


కాకినాడ సముద్రతీరంలో

ఆరో రోజు 'టైగర్ ట్రయింఫ్ -2025'

భూమి, సముద్రం, ఆకాశంలో ప్రదర్శనలు






సాగరతీరంలో విన్యాసాల దృశ్యాలు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్ర తీరంలో గత 6 రోజులుగా నిర్వహిస్తున్న టైగర్ ట్రయింఫ్ విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి. భారత్- అమెరికా దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తోన్న టైగర్ ట్రంప్ విన్యాసాల్లో భాగంగా శనివారం ఇరుదేశాల త్రివిధ దళాలు పోటాపోటీగా భూభాగం, సముద్రం, ఆకాశంలో విన్యాసాలు నిర్వహించాయి. సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో టైగర్ ట్రయింఫ్-2025లో భాగంగా భారత్-అమెరికా యంపీబియస్ విన్యాసాల్లో ఇరుదేశాలకు చెందిన సుమారు 1000 మంది త్రివిధ దళాల సభ్యులు పాల్గొన్నారు. ముఖ్యంగా యుద్ధ సమయంతో పాటూ తుఫాన్లు, విపత్తుల వేళ అనుసరించాల్సిన వ్యూహం, అందించే సహాయ పునరావాస సమయాల్లో ఏ కార్యక్రమాలు చేస్తారో ఇరుదేశాల సైనిక దళాలు ప్రదర్శించారు. హోవర్ క్రాఫ్ట్‌లు, యుద్ధ ట్యాంకులు, యుద్ధ హెలికాప్టర్ల వినియోగం, భద్రత, అత్యాధునిక ఆయుధాలను వినియోగించే శత్రుదేశాలపై ఎలా దాడులు చేస్తారో సంయుక్తంగా విన్యాసాలు చేశారు. యుద్ధ సమయాల్లో గాయపడిన త్రివిధ దళాల సభ్యులకు ఏ విధంగా ప్రథమ చికిత్స, వైద్య సేవలు తదితర వాటిపై ప్రదర్శించారు. శనివారంతో యుద్ధ విన్యాసాలు ముగిసినట్టేనని భావిస్తున్నారు.

వడగాల్పులు వర్షపు చినుకులు





ఎండలు మండిపోతున్నాయి. రాజమహేంద్రవరంలో శనివారం మధ్యాహ్నం తీవ్ర వడగాల్పులకు ప్రజలు అపసోపాలు పడ్డారు. అయితే సాయంత్రం అకస్మాత్తుగా వర్షం రావడంతో ఎంతో ఉపశమనం పొందారు.

ఫొటోగ్రాఫర్– రాజమహేంద్రవరం

అన్నవరం దేవస్థానం కొండపై...

మహిళ మెడలో బంగారం చోరీ


చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రత్తిపాడు సీఐ, అన్నవరం ఎస్ఐ

అన్నవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం కొండపై ఒక వివాహానికి హాజరైన మహిళ మెడలో బంగారు హారం, నెక్లెస్‌ను ఇద్దరు దుండగులు అపహరించుకుపోయారు. రంగంపేట మండలం కోటపాడు గ్రామానికి చెందిన మహిళ అన్నవరం దేవస్థానంలో వివాహానికి హాజరయ్యారు. శుక్రవారం రాత్రి సత్యగిరి జంక్షన్ వద్ద తమ బృందంతో ఎదురుచూస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని వస్తువులు తెంచుకునిపోయారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. సంఘటన ప్రాంతాన్ని శనివారం ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు, అన్నవరం ఎస్ఐ హరిబాబు పరిశీలించి కమాండ్‌కంట్రోల్ రూంలో సీసీ ఫుటేజీ ఆధారంగా కొన్ని గుర్తులు గుర్తించారు. ఫుటేజీ క్లారిటీగా లేదని, సంఘటన జరిగిన ప్రాంతంలో వెలుగు లేకపోవడంతో దుండగులు రెక్కీ నిర్వహించి దాడికి పాల్పడినట్టు భావిస్తున్నామన్నారు.

మనస్తాపంతో ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

విఆర్‌పురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురై బాలిక ఉరి వేసుకుని మృతిచెందింది. బాలిక తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. 2నెలల క్రితం ఏడుగురాళ్ల పల్లి పంచాయతీ బాయిబొక్క గ్రామం నుంచి కూలీ పనుల కోసం జీడిగుప్ప గ్రామానికి కొండా కుంచమ్మ (15), తల్లి బుల్లెమ్మ వచ్చారు. వారం రోజుల నుంచి ఇంటికి వెళదామంటూ మారాం చేస్తూ పనికి వెళ్లకుండా మకాం దగ్గరే ఉంటుంది. గురువారం తల్లి బుల్లెమ్మ కూలీ పనికి వెళ్లి సాయంత్రం వచ్చి చూస్తే కుంచమ్మ లేదు. చుట్టుపక్కల వెతుకుతుండగా చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించింది. ఈ విషయాన్ని గురువారం రాత్రి పోలీసులకు బుల్లెమ్మ తెలపడంతో వీఆర్‌పురం ఎస్ఐ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. శుక్రవారం కోతులగుట్ట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుంచమ్మ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్...

ఇద్దరి అరెస్టు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణం రామదుర్గావీధిలో క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో రామదుర్గావీధిలో 2 అంతస్థుల భవనాన్ని కోనాల శ్రీనివాసరెడ్డి 2 సంవత్సరాల క్రితం అద్దెకు తీసుకుని క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. బెట్టింగ్‌కు కావలసిన టీవీ, ల్యాప్‌ట్యాప్, ఫోన్లు ఏర్పాటు చేసుకుని సహాయకుడిగా మా చవరానికి చెందిన రాళ్ల నాగబాబును నెలకు రూ.15వేలు జీతానికి నియమించుకున్నాడు. బెట్టింగులో వచ్చిన లాభాలను జల్సాలకు వాడుకుంటున్నాడు. ఈ మేరకు ఎస్ఐకు వచ్చినసమాచారంతో డీఎస్పీ రఘువీర్ పర్యవేక్షణలో సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 10.30 గంటలకు ఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బందితో దాడిచేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.50వేల నగదు, 9 సెల్‌ఫోన్లు, 1 ల్యాప్‌టాప్, టీవీసెట్, సెట్‌టాప్ బాక్సు, జియో ఫైబర్‌బాక్సు, సుజుకీ మోటారు సైకిల్ సీజ్ చేసి కేసు నమోదు చేశారు. కోనాల శ్రీనివాసరెడ్డి, రాళ్ల నాగబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు. క్రికెట్ బెట్టింగ్‌పై ఏ విధమైన సమాచారం తెలిసినా డీఎస్పీ 9440796507, సీఐ 9440796536, ఎస్ఐ 9440796589 నెంబర్లలో తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

విద్యార్థి విభాగం జోనల్ అధ్యక్షుడిగా రమేష్

అమలాపురం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ ఆదేశాల మేరకు విద్యార్థి విభాగం జోనల్ అధ్యక్షుడిగా జిల్లెల్ల రమేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం భట్నవిల్లిలోని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌తో పాటు పార్టీ నాయకులు రమేష్‌ను అభినందించి సత్కరించారు.

ఉపాధి హామీతో అభివృద్ధి పనులు

మామిడికుదురు, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని ఉపాధి హామీ ఏపీవో రమేష్‌బాబు తెలిపారు. లూటుకుర్రులో పంచాయతీ చెరువును రూ.5లక్షలతో అభివృద్ధి చేస్తున్నామని, పాశర్లపూడి, మామిడికుదురు, లూటుకుర్రు గ్రామాల్లో ఈచెరువును అభివృద్ధి చేస్తున్నామన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చేస్తా: ఎమ్మెల్యే దేవ

మలికిపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు సక్రమంగా తాగునీరు అందించాలన్నదే లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం కడలివారి గ్రూపులో రూ.31.70లక్షల జలజీవన్‌మిషన్ నిధులతో నిర్మించిన వాటరు ట్యాంకును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రమాణ స్వీకారం చేయక ముందు నుంచి తాగునీటి సమస్యపైనే దృష్టి పెట్టానన్నారు. గొంది, కరవాక వంటి శివారు ప్రాంతాలకు ప్రతీరోజు తాగునీరు అందించాలన్నదే తన ఆశయమన్నారు. దానిలో భాగంగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో, రాష్ట్ర ప్రభుత్వంతో పలుమార్లు చర్చించానన్నారు. గుడిమెళ్లంక ప్రాజెక్టు వద్ద పాడైన మోటార్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామని, గుడిమెళ్లంక



మలికిపురంలో వాటరుట్యాంకును ప్రారంభించిన రాజోలు ఎమ్మెల్యే దేవ

ప్రాజెక్టుకు ప్రత్యేకంగా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. వాటరు ట్యాంకు నిర్మాణానికి స్థలం అందించిన గంటా బాబూరావును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, ఎంపీటీసీలు శ్రీదేవి, సీతామహలక్ష్మి, గెడ్డం తులసీభాస్కర్, జంపన సత్యనారాయణరాజు, గుబ్బల బాబ్జి, నల్లి మోహనరావు, వెంకట్రామరాజు, సత్తిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రితో మాట్లాడా

మలికిపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బైపాస్ రోడ్డు, గోదావరిపై వంతెన విషయంలో గుడిమెళ్లంకకు చెందిన ఒక వ్యక్తి కేవలం రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి బూచిగా చూపించి సుప్రీంకోర్టులో పిటిషన్‌వేసి నాలుగేళ్లుగా అడ్డుకుంటున్నట్టు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మతో మాట్లాడినట్టు చెప్పారు. రూ.600కోట్ల ప్రాజెక్టును వ్యక్తిగత స్వార్థంలో ముందుకు వెళ్లనివ్వడం లేదని, సుప్రీంకోర్టు అడ్వకేట్స్ సహాయంతో కేసును డిస్మిస్ చేయించాలని కోరానని దేవ వరప్రసాద్ తెలిపారు. దేవ వెంట దిరిశాల బాలాజీ ఉన్నారు.

చెత్త నుంచి సంపద తయారీకి ప్రాధాన్యమివ్వాలి

డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జిరాజు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోడ్ల పక్క ఎక్కడా చెత్తా చెదారాలు నిల్వ ఉండరాదని అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు సూచించారు. గ్రామాల్లో చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. చెత్త నిల్వలు పేరుకుపోతే ప్రజారోగ్యం



భట్నవిల్లి పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్పీవో బొజ్జిరాజు

దెబ్బతింటుందన్నారు. శనివారం భట్నవిల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తడి చెత్త పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యుసీపీ షెడ్డులో వర్మి కంపోస్టు తయారు చేయడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేయాలని సూచించారు. వర్మి కంపోస్టును ఎరువుగా వినియోగించుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను డీఎల్పీవో పరిశీలించారు. కార్యదర్శి రెడ్డి శిరీష, దారా రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలబాలాజీస్వామికి విశేష పూజలు

మామిడికుదురు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి అర్చకులు శనివారం వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి తొలిహారతి ఇచ్చారు. శనివారం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. స్వామివారిని శనివారం ఒక్కరోజు 3500 మంది దర్శించుకుని 1800మంది నిత్యాన్నదానంలో అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,76,303 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా ఈవో, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

అయినవిల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు గ్రామంలో గల శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టమ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం రెండోరోజు స్వామివారికి తోమాల సేవ, సుప్రభాతసేవ, బాలబోగ నివేదన, ప్రాతఃకాల అర్చన, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నవసంధి, స్నపనపూజ, ధ్వజావరోహణ నిర్వహించారు. సంతానం లేనివారికి సంతానం కలగడానికి, అనారోగ్యం గలవారికి ఆరోగ్యం కోసం గరుడ ప్రసాదం పంపిణీ చేశారు.

శ్రీసాయి విద్యార్థుల ప్రతిభ



యానాం టాపర్స్‌ను సత్కరిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, శ్రీసాయి ప్రతినిధులు

యానాం, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):ఇంటర్‌లో యానాం శ్రీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల చైర్మన్ జీవీ నాయుడు తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో మండా నాగా వీర సాయి శుభ సారిక 463, బైపీసీలో కాలడి చరిష్మా 433, సీఈసీలో కాలడి సాయికృష్ణ 456, ద్వితీయసంవత్సరం ఎంపీసీలో తిరగాటి శ్రావ్య 984, సీఈసీలో అసియారెహమాన్ 965, బైపీసీలో ర్యాలి నికితసాయితు లసిలక్ష్మీశ్రీ 983మార్కులతో యానాం రీజియన్ టాపర్స్‌గా నిలిచారన్నారు. జూనియర్ ఇంటర్‌లో 87మంది విద్యార్థులకు 78మంది (89శాతం), సీనియర్ ఇంటర్‌లో 92మందికి 85మంది (92శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. ఢిల్లీ ప్రత్యేకప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి మునిస్వామి, కళాశాల చైర్మన్ జీవీ నాయుడు, ప్రిన్సిపాల్ ఎం.లోవరాజు విద్యార్థులను శాలువాలతో సత్కరించారు.

నూరుశాతం అడ్మిషన్లు

అమలాపురంరూరల్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): నూరుశాతం ఎన్రోల్మెంట్‌తోనే ఉపాధ్యాయ పోస్టులు మంజూరు, కొనసాగింపు జరుగుతుందని సీనియర్ ఉపాధ్యాయుడు పోతంశెట్టి దొరబాబు పేర్కొన్నారు. సాకుర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్ఎం పుచ్చకాయల బాబూరావు అధ్యక్షతన గ్రామపెద్దల సమావేశం నిర్వహించారు.

సమస్యలపై ఓఎన్జీసీ అధికారులతో చర్చిస్తా

అల్లవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామాభివృద్ధి, సమస్యలపై ఈనెల15వ తేదీ నాటికి గ్రామస్తులు లేఖ ఇస్తే ఓఎన్జీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని అమలాపురం ఎంపీ జి.హరీష్‌మాధుర్ అన్నారు. ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎంపీ హరీష్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు సందర్శించారు. అనంతరం ఓడలరేవు సిద్ధార్థపేటలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఎంపీ హరీష్ ఆవిష్కరించారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, వేగిరాజు వెంకట్రాజు, పచ్చిమాల ఏడుకొండలు, దాట్ల గోపీరాజు, అల్లు సత్తిబాబు, కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణ, ఇసుకపట్ల రఘుబాబు పాల్గొన్నారు.

చెత్త సమస్యను పరిష్కరించండి

యానాం, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): యానాంలో చెత్త సమస్యను పరిష్కరించాలంటూ అన్నాడీఎంకే యానాం శాఖ కార్యదర్శి మంచాల సత్యసాయికుమార్ ఆధ్వర్యంలో పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ఆందోళన నిర్వహించారు. అధికారుల నిర్లక్ష్యం వీడి డంపిగ్ యార్డుకు స్థలాన్ని కేటాయించాలన్నారు. యానాం వర్తక సంఘం అధ్యక్షుడు నల్ల వెంకన్న, మాగాపు సుబ్బారావు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి ఈలప్రోలు విష్ణువర్ధన్‌రావు, పెసల వెంకటేష్, చెక్కల అరుణ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ లైట్లతో నిరసన

ముమ్మిడివరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నాలుగు రోడ్ల కూడలిలో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో ఆ ప్రాంత వాసులంతా సెల్‌ఫోన్‌లో లైట్లు వెలిగించి నిరసన తెలిపారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఇంటర్‌లో సత్తాచాటిన విద్యార్థులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యామండలి శనివారం విడుదల చేసిన పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 56శాతం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 82శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ డి.కృష్ణకిశోర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపు విద్యార్థిని సుదీప్తి 1000మార్కులకు 934 మార్కులు సాధించింది. ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని డి.రత్నశ్రీ 470మార్కులకు 450 మార్కులు సాధించింది. బైపీసీ విద్యార్థిని తాడి రీనాజాస్మిన్ 440మార్కులకు 400 మార్కులు, సీఈసీలో నల్లా అనూష 500మార్కులకు 450 మార్కులు, ఒకేషనల్ విభాగంలో కడలి లక్ష్మీప్రసన్న 924మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. వీరిని ఇన్‌చార్జి కె.శిరీష, లెక్చరర్ ఇన్ లైబ్రరీ సైన్స్ వై.సుబ్బారావులు అభినందించారు.

ఆదిత్య జూనియర్ కళాశాలలో..

అమలాపురం ఆదిత్య జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీలో యాళ్ల ప్రసన్నాంబిక, బళ్ల లక్ష్మీసంజన 466 మార్కులు, మురుకూరి నందిని 465, ఆరుగురు విద్యార్థులకు 464, ఏడుగురు విద్యార్థులకు 463 చొప్పున మార్కులు వచ్చినట్టు కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ చలపతిరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో శీలం గీతిక 989 మార్కులు, వడలి శ్రీశాంత్ 987, మహ్మద్ నఫీలరిజ 985 మార్కులు సాధించారు.జూనియర్ బైపీసీలో మహ్మద్ నగీన 434, సీనియర్ బైపీసీలో గెల్లా ధనలక్ష్మి 976మార్కులు సాధించగా ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, కార్యదర్శి నల్లమిల్లి కృష్ణదీపక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చలపతిరావు, అధ్యాపకులు అభినందించారు.

శ్రీచైతన్యలో..

శ్రీచైతన్యజూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీలో సీహెచ్ వర్షిత, ఎం.మేఘన 465 మార్కులు, బైపీసీలో ఓ.దీప్తి 434, సీహెచ్‌కే లక్ష్మి 434, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కేఎఎస్ఎం లక్ష్మి 990మార్కులు, ఆషికు మారిజైన్ 988, బైపీసీ గ్రూపులో జి.దుర్గ 986 మార్కులు సాధించగా విద్యార్థులను కళాశాల ఏజీఎం హరిప్రసాద్, డీన్ రాంబాబు, ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఏవో బాజీలు అభినందించారు.

నారాయణ కళాశాలలో..

నారాయణ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపు నుంచి ముషిణి డీఎస్ కామేష్ 466, శింగంశెట్టి జ్యోష్ణగిడుగు లక్ష్మీదీపిక 465 మార్కులు, బైపీసీ గ్రూపులో కోరుకొండ చేతన 432, ఆకుల వీడీ మౌనిక 431మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ నుంచి కోడూరి బీఏలక్ష్మి 991, లక్కింశెట్టి చాందినీ 990 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ తెలిపారు. వీరిని డీజీఎం కృష్ణ, డీన్ సురేష్, ఏజీఎం ప్రసాద్ తదితరులు అభినందించారు.

వీరేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం

ఐ.పోలవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శనివారం చండీహోమం నిర్వహించారు. చైత్రమాసం పౌర్ణమి పురస్కరించుకుని చండీహోమం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన అనంతరం చండీ హోమం నిర్వహించారు. ప్రతినెల పౌర్ణమి రోజున జరిగే పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయల ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ కోరారు. భక్తులు, ఆకొండి కిరణ్ పాల్గొన్నారు.

పంటకాల్వలో పడి వృద్ధుడి మృతి

అమలాపురంరూరల్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తి పంటకాల్వలో పడి మృతిచెందాడు. కామనగరువు మేధా గార్డెన్‌కు చెందిన బత్తుల ఏడుకొండలు(61) గతంలో ఆర్టీసీలో పనిచేసేవాడు. కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. బహిర్భూమికి వెళ్లి పంటబోదెలో జారిపడి మృతిచెందినట్టు గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు శనివారం తెలిపారు.

బీచ్ వాలీబాల్ పోటీలు ప్రారంభం

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు అన్నారు. ఎస్.యానాం బీచ్‌లో ఏపీజర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌వాలీబాల్ టోర్నమెంటును శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులం ప్రసాద్, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, బీజేపీకి చెందిన నల్లా పవన్‌కుమార్, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ బోళ్ళ వెంకటరమణ, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, జనసేన నాయకుడు పలచోళ్ళ పద్మనాభం, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్‌బాబు పాల్గొన్నారు.

స్వచ్ఛ కిమ్స్ కార్యక్రమం

అమలాపురం రూరల్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) పిలుపు మేరకు స్వచ్ఛాంధ్ర తరహాలో శనివారం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛ కిమ్స్ కార్యక్రమం నిర్వహించారు. వైస్ చైర్మన్ మోహన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పరిసరాలన్నీ పరిశుభ్రంగా చేశారు. కార్యక్రమంలో కిమ్స్ ఎండీ పి.రవికిరణ్‌వర్మ, డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, డాక్టర్ హరికిరణ్‌వర్మ, సీఏవో రఘు, మెడికల్, డెంటల్, ఫిజియోథెరపీ, నర్సింగ్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

'శవరాజకీయాలు మానుకోవాలి'

పి.గన్నవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలపై వైసీపీ నాయకులు చేస్తున్న శవరాజకీయాలు మానుకోవాలని టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు డొక్కా నాథ్‌బాబు మండిపడ్డారు. గోశాలలో పదుల సంఖ్యలో గోవులు మృతిచెందినట్లు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఈనెలలో అనారోగ్యంతో ఒక ఆవు మాత్రమే మృతి చెందిందన్నారు. ఈవిషయాన్ని మరిచి నెయ్యి దగ్గర నుంచి గోశాల వరకూ అపవిత్రత చేసిన వైసీపీ నాయకులకు గోశాలపై విమర్శలు చేసే నైతిక హక్కులేదన్నారు.

ఘనంగా జగన్మోహిని కేశవస్వామి చక్రస్నానం



చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా ఏడవ రోజు శనివారం స్వామి వారికి ప్రత్యేక అర్చన, తులసిపూజ, అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతిని వేద పండితులు కన్నుల పండుగగా నిర్వహించారు. కేశవమాలాధారులు, భక్తులు నది ఒడ్డున స్వామివారి గ్రామోత్సవం జరిపారు. అనంతరం స్వామి వారి చక్రస్నానాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. సాయంత్రం నిత్యోపాసన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని విరాళాలు ఇచ్చారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి వీటి ఏర్పాట్లు నిర్వహించారు.

పీఠంలో వైభవంగా చైత్ర పౌర్ణమి పూజలు

రాయవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో శనివారం ఫాల్గుణ పౌర్ణమి పూజలను వైభవంగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి ప్రత్యేక అలంకరణ జరిపారు. తొలుత విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చనలు చేశారు. అనంతరం అమ్మవారికి లలితా అష్టోత్తర, సహస్ర నామాలు, దుర్గాత్రిశతి, ద్వాతింశ నామావళి, లక్ష్మి, సరస్వతి, దుర్గా అష్టోత్తరాలతో కుంకుమ పూజలు, భవాని శంకర సమేత అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం చేశారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గ సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఆర్వో బాబి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పీఠంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

మాచవరంలో బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమం



పల్లెకు పోదాం కార్యక్రమంలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

రాయవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మాచవరం గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు రైతులతో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సమస్యలను తెలుసుకోగా గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంకా తెరవలేదని బీజేపీ నాయకుల దృష్టికి వారు తీసుకువచ్చారు. బీజేపీ నాయకులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని 16న ప్రారంభిస్తామని సీఈవో రామకృష్ణారెడ్డి చెప్పారని బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు, బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నరాల రాంబాబు, ఈరెళ్ల కృష్ణమూర్తి, శాకా ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మందపల్లి స్వామివారి ఆదాయం రూ.2.31లక్షలు

కొత్తపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,31,333 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



శనేశ్వర ఆలయంలో తైలాభిషేకాలకు బారులుతీరిన భక్తులు

తిరుమల గోశాలపై దుష్ప్రచారం తగదు

కొత్తపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల గోశాలపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దుష్ప్రచారం చేయడం తగదని జిల్లా టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం ఖండించారు. గత ప్రభుత్వంలో అన్యమతాన్ని ప్రచారం చేసి తిరుమల పవిత్రత, ప్రతిష్ఠతను భ్రష్టుపట్టించారని వారు మండిపడ్డారు. టీటీడీ దేవస్థానంలో 2,668 రూమ్‌లు ఉన్నాయని, జియోట్యాగింగ్ ద్వారా టీటీడీ వాటిని నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. ఆయన వ్యాఖ్యలు అర్థరహితమని దుష్ప్రచారానికి పాల్పడితే సహించేది లేదని వారు హెచ్చరించారు.



టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.49.97లక్షలు



ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తజనం

ఆత్రేయపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం పలువురు భక్తులు తులాభారాలు, కానుకులు సమర్పించారు. భక్తులకు మజ్జిగ, తాగు నీరు, వృద్ధులకు, చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. స్వామి వారి అన్నప్రసాదంలో భక్తజనం పాల్గొన్నారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.49.97 లక్షలు వచ్చినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు.



టీడీపీ క్యాంపు కార్యాలయంలో విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే వేగుళ్ల

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీఎస్‌ఓ ఒలింపియాడ్ రెండవదశ పోటీల్లో తాపేశ్వరం శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో చైతన్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం

ఐ.పోలవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శనివారం చండీహోమం నిర్వ హించారు. చైత్రమాసం పౌర్ణమి పురస్కరిం చుకుని చండీహోమం ప్రత్యేక పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన అనంతరం చండీ హోమం నిర్వహించారు. ప్రతినెల పౌర్ణమి రోజున జరిగే పూజల్లో భక్తులు పాల్గొని స్వా మివారి కృపకు పాత్రులు కావాలని ఆయల ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ కోరారు. భక్తులు, ఆకొండి కిరణ్ పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వృత్తి విద్యా తరగతుల పరిశీలన

ద్రాక్షారామ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ తరగతులను జిల్లా కోఆర్డినేటర్ కె.రమేష్ శనివారం పరిశీలించారు. పదిరోజులుగా ద్రాక్షారామలో కంప్యూటర్, వ్యవసాయ విద్యాకోర్సులు బోధిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల శిక్షణ విధానం, ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల హవా

మండపేట, ఏప్రిల్, 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఏడిద జిల్లా పరిషత్ ప్లస్-2 విద్యార్థినులు సత్తా చాటారు. ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీ విద్యార్థిని కొమ్ము శైలజ 946 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో 908 మార్కులతో కోసూరి శాలిని ద్వితీయస్థానం సాధించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో పంతంగి రమ్యశ్రీ బైపీసీలో 433 మార్కులతో సత్తా చాటారు. మరో విద్యార్థిని ఎం.మేఘన 419 మార్కులతో ద్వితీయస్థానం సాధించింది. ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో 80 శాతం మేర ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం ఎం.వెంకట్రాజు తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. విజేతలైన విద్యార్థినులను సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఉపాధ్యాయులు అభినందించారు.

వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో: మండపేట వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ కె.అప్పలరాజు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 62 శాతం ఉత్తీర్ణత, ప్రథమ సంవత్సరం 47 శాతం సాధించారని తెలిపారు. ద్వితీయ ఇంటర్‌లో బైపీసీలో ఎం.నాగస్వాతి 965 మార్కులు, ఎంపీసీలో ఎ.మహేష్ 930, ద్వితీయ ఇంటర్ సీఈసీలో జంపా దివ్యవాణి 924 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీలో గెద్దాడ సురేఖ 453 మార్కులు, బైపీసీలో పిల్లి ప్రశాంతి 429 మార్కులు, హెచ్‌ఈసీలో సూరపటేశ్వరి 460 మార్కులు సాధించారని ఆయన తెలిపారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామారావు తెలిపారు. శనివారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎం.అమృత వర్షిణి 967, బైపీసీలో ఎం.నందిని 871, సీఈసీలో కె.చండీప్రియ 927, హెచ్‌ఈసీలో పి.వెన్నెల 788 మార్కులు సాధించినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో పి.సాయి త్రివేణి 423, బైపీసీలో వి.వెంకటరమణ 370, సీఈసీలో కె.స్రవంతి 412, హెచ్‌ఈసీ నుంచి ఎల్.హేమంత్ 397 మార్కులు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రామారావు, లెక్చరర్ డీవీవీ నాగేశ్వరరెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.



కె.గంగవరంలో ఇంటర్‌లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

ఇంటర్‌లో మోడరన్ విద్యార్థుల ప్రతిభ

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో రామచంద్రపురం మోడరన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ గ్రూపునకు చెందిన పి.భారతి 987, డి.సత్యనీరజ 986, బి.జస్వంత్ 986 డి.శ్రీఅంజి 984, తరుణ్‌కుమార్ 983, కె.కీర్తిక 983 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపీసీకి చెందిన పీఎల్ సత్యశ్రావ్య 980 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ గ్రూపునకు చెందిన జి.పూజిత 465, కె.లక్ష్మీ సత్య 464, హెచ్.భాగ్యశ్రీ 464, ఎ.మనోజ్ 463, పి.సంజన 463, టి.రమ్యశ్రీ 463 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో కె.గీతాశ్రీ 433, ఎం.అశీరావు 432 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ఆయనతోపాటు, అధ్యాపకులు అభినందించారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): పామర్రు జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో బాలికలు సత్తా చాట్టారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో పామర్రు గ్రామానికి చెందిన నున్న ఏ.డి.బి. సాయి అంజలి ఎంపీసీలో 952 మార్కులతో ప్రథమస్థానం సాధించింది. కోటిపల్లి గ్రామానికి చెందిన బిందు మాధవి ఎంపీసీలో 919 సాధించి ద్వితీయ స్థానం సాధించింది. యండగండి గ్రామానికి చెందిన గెద్దాడ లక్ష్మీమౌనిక బైపీసీలో 867 మార్కులతో తృతీయస్థానం సాధించింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో కూళ్ల గ్రామానికి చెందిన కనకాల అశీష్ కుమార్ 414 మార్కులతో మొదటి స్థానం, 325 మార్కులతో కె.చిన్ని ద్వితీయస్థానం సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 84 శాతం, ఇంటర్ మొదటి సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్లస్ టూ జూనియర్ కళాశాల మాచర విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైసీపీ గ్రూపుల్లో నూరు శాతం, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 60శాతం, బైపీసీలో 100 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారని పాఠశాల హెచ్‌ఎం రమాదేవి తెలిపారు. ఎంపీసీ గ్రూపులో గాడ ద్రాక్షవల్లి 842, బైసీపీలో నూపే కల్యాణి 788, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కేవీ హర్షిణి 451, బైసీపీలో నీలం వందన 282 మార్కులు సాధించారన్నారు. ప్లస్‌టూ జూనియర్ కళాశాల అంగర విద్యార్థినులు జూనియర్ ఇంటర్ ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో 45 శాతం, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 66 శాతం, సీఈసీలో ఒక విద్యార్థిని ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం రాజు తెలిపారు. ఎంపీసీ గ్రూపులో సెలా సాయిదుర్గ 303 , సీఈసీలో రజితశ్రీ 290 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కనకమహాలక్ష్మి, ఎల్లారమ్మలకు ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు

మండపేట, ఏప్రిల్, 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోనున్న గ్రామదేవతలు ఎల్లారమ్మ, కనకమహాలక్ష్మి అమ్మవార్లను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరావు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, వాదా ప్రసాదరావు, పాలమూరి శ్రీను, కె.రామారావు తదిరులు పాల్గొన్నారు.



విజ్ఞాన్‌లో గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించిన దృశ్యం

విజ్ఞాన్‌లో గ్రాడ్యుయేట్ దినోత్సవం

మండపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండపేట ఏడిద రోడ్డులో వున్న విజ్ఞాన్ పాఠశాలలో శనివారం కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలను నిర్వహించారు. ప్రీకేజీ పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. విద్యా సంస్థల డైరెక్టర్ ఇనపకోళ్ల గణేష్ చౌదరి, ప్రిన్సిపాల్ శివప్రసాద్ మాటాడారు. విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

కె.గంగవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అముజూరు గ్రామంలో హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో పార్క్ చేసిన వాహనాల్లో నగదు చోరీ చేసిన దొంగను అరెస్టు చేసినట్లు పామర్రు ఎస్‌ఐ ఎస్.కె. జానీ బాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలమూరు గ్రామానికి చెందిన పాత నేరస్తుడు గండేటి నరసింహమూర్తి ఇటీవల జైలుశిక్ష అనుభవించి విడుదలయ్యాడు. బయటకు వచ్చి మళ్లీ దొంగతనాలు మొదలు పెట్టాడు. గ్యాస్ బండలు తరలించే వాహనాల్లోని నగదు చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు పంపించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

రాయవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లల్ని చేర్పించాలని రాయవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి.శాంతి సునిత పిలుపునిచ్చారు. శుక్రవారం రాయవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను బడిలో చేర్పించాలని ఇంటింటా ప్రచారం చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు, క్వాలీఫైడ్ టీచర్లు, ఫీజులు లేని విద్యను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయవరం, లొల్ల ఎంపీయూపీ స్కూల్‌లో విద్యార్థులను తమ పాఠశాలలో 9,10 తరగతుల్లో చేరాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరాంజనేయరెడ్డి, డి.శ్రీనివాస్, వి.సాయన్న, బీపీ రామకృష్ణ , ఎన్.సుధాకర్, యూపీ స్కూల్ హెచ్‌ఎం కొవ్వూరి నాగిరెడి తదితరులు పాల్గొన్నారు.

ఇంటికొక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దడమే లక్ష్యం

కార్మికశాఖా మంత్రి సుభాష్

రాయవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం చెల్లూరు గ్రామంలో చిన్న, సూక్ష్మ మధ్య తరగతి (ఎంఎస్ ఎంఈ) ద్వారా ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భ ంగా మంత్రి మాట్లాడుతూ ఒకపక్క ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపడుతూనే, మరోపక్క నిరుద్యోగులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రక్రియ కొనసాగిస్తుందన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు 32 మంది ముందుకు రాగా తొలి పరిశ్రమగా స్నాకేత్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించామన్నారు. రామచంద్రపురంలో తన క్యాంపు కార్యాలయంలో ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేసి పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తామన్నారు. గీతార్థా టాక్స్ కన్సల్టింగ్ వ్యవస్థాపకుడు మణికంఠ, టీం సభ్యులను మంత్రి అభినందించారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.



చెల్లూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్



పడమరఖండ్రికలోనున్న అమ్మవారు

రాజ్యలక్ష్మి అమ్మవారి జాతర

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పడమరఖండ్రికలోనున్న రాజ్యలక్ష్మి అమ్మవారి జాతర, తీర్థం ఘనంగా జరిగింది. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా మధ్య వైభవంగా జరిపారు. అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. శనివారం అమ్మవారి ఆలయం వద్ద తీర్థం జరిగింది. అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల భక్తులు అమ్మవారికి సారెతోపాటు, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు.

ఎన్‌టీఆర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలి

తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షుడు రామ్

మండపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షుడు బీవీ రామ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన మండపేట ఎమ్మెల్యే రాష్ట్ర ఈసీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావును శనివారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. గతంలో అధికారంలో వున్నప్పుడు టీడీపీ నేతలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను అరెస్టు చేసి పోలీసులు తమ నిబద్ధతను చాటారన్నారు.

చివరి మజిలిలో అంతిమ సంస్కారం గొప్పది



కొత్తపేట కైలాసభూమిని ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు తదితరులు

కొత్తపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): చివరి మజిలిలో అంతిమ సంస్కారం గొప్పగా ఉండాలనే ఆకాంక్షతో కైలాస భూమిని నిర్మించామని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శనివారం లయన్స్ క్లబ్, దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో నిర్మించిన కైలాస భూమిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి ఆఖరి ఘట్టాన్ని పూర్తి సౌకర్యాలతో సాగనంపాలనే ఆలోచనతో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సామాజికవేత్త ఎన్‌వీ వీఎస్ రెడ్డియ్య అంకుర్పారణ చేశారన్నారు. దీనికి దాతలు, ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి పూర్తి చేశారని, దీనికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్, బాదం ఐ బ్యాంకు నిర్వాహకుడు బాదం బాలకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కవల చిన్నారులతో మంత్రి సరదాగా..

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన మంత్రి సుభాష్ ఆటవిడుపుగా కవల చిన్నారులను ముద్దు చేశారు. శనివారం గుబ్బలవారిపేటలో ఇటీవల కవలలకు జన్మనిచ్చిన వాసంశెట్టి లక్ష్మీకుమారిని పరామర్శించేందుకు వెళ్లారు. కవల చిన్నారులను చూసిన మంత్రి వారిని కొంతసేపు ఎత్తుకుని ముద్దు చేశారు. మంత్రి సుభాష్ ఇద్దరు కుమార్తెలు కూడా కవలలు. కవలల తల్లి లక్ష్మీకుమారికి రూ 10 వేలు ఆర్థికసాయం, ఆటపరికరాలు అందచేశారు. వేసవి దృష్ట్యా చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని మంత్రి సూచించారు.



కవల చిన్నారులతో మంత్రి సుభాష్

బాలబాలాజీస్వామివారికి ప్రత్యేక పూజలు



మామిడికుదురు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి అర్చకులు శనివారం వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి తొలిహారతి ఇచ్చారు. శనివారం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. స్వామివారిని శనివారం ఒక్కరోజు 3500 మంది దర్శించుకుని 1800మంది నిత్యాన్నదానంలో అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,76,303 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా ఈవో, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

అయినవిల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు గ్రామంలో గల శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టమ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం రెండోరోజు స్వామివారికి తోమాల సేవ, సుప్రభాతసేవ, బాలభోగ నివేదన, ప్రాతఃకాల అర్చన, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నవసంధి, స్నపనపూజ, ధ్వజావరోహణ నిర్వహించారు. సంతానం లేనివారికి సంతానం కలగడానికి, అనారోగ్యం గలవారికి ఆరోగ్యం కోసం గరుడ ప్రసాదం పంపిణీ చేశారు.



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సారా తయారీ స్థావరాలపై దాడులు చేశారు. వెలిచేరు గోదావరి లంకలోని 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు సీఐ కాత్యాయని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన విద్యా విధానంతో ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేష్ తీసుకువచ్చిన మెరుగైన విద్యా విధానంతోనే ఇంటర్‌లో మంచి ఫలితాలు వచ్చాయని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిషంత్ రాయ్ పేర్కొన్నారు. గత పదేళ్లలో ఇంటర్‌లో అత్యధిక ఉత్తీర్ణత ఈ ఏడాది నమోదు అయిందన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాల్లో కూడా మంచి ఫలితాలు వచ్చాయన్నారు.



చల్లా వెంకటేష్



జె.నిఖిల్ వర్మ

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ రెండవ సంవత్సరం ఎంపీసీ గ్రూపు విద్యార్థి చల్లా వెంకటేష్ 982 మార్కులు సాధించాడు. బైపీసీకి చెందిన పలివెల జ్ఞానాభిక్షిత 941 మార్కులు సాధించింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపునకు చెందిన జె.నిఖిల్ వర్మ 459, బైపీసీకి చెందిన పాటి హారిక 440 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.